క్లుప్తంగా

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన అనితారెడ్డి

విద్యారణ్యపురి : సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్, కేయూ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితారెడ్డి కేయూ సమీపంలోని లార్డు పట్టణ నిరాశ్రయుల, వృద్ధాశ్రమాన్ని మంగళవారం సందర్శించారు. అక్కడ వారికి కల్పిస్తున్న సౌకర్యాలను, సమస్యలను వృద్ధులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల చెత్త డబ్బా వద్ద ఉంటూ ఇబ్బంది పడుతున్న ఓ వ్యక్తి గురించి నగరవాసులు అందించిన సమాచారంతో ఆశ్రమ నిర్వాహకులు ఆశ్రమానికి తీసుకొని రాగా అతని గురించికూడా అనితారెడ్డి అడిగి తెలుసుకుని, అతనితో కూడా మాట్లాడారు. అయితే వృద్ధుడి పేరు లక్ష్మయ్య అని చెబుతూ తనకు ఎవరూ లేరని చెప్పారని అనితారెడ్డి తెలియజేశారు. నిర్వాహకులు ఇలాంటి వారిని ప్రేమగా చూసుకొని కౌన్సిలింగ్ ఇస్తూ వారి కుటుంబాల గురించి కూడా వివరాలు సేకరించాలని ఆమె సూచించారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకుడు నరేష్‌తో అనితారెడ్డి ముచ్చటించారు.

చలివేంద్రం ప్రారంభం



కాజీపేట అర్బన్ : నగరంలోని 31 డివిజన్ న్యూశాయంపేట కూడలిలో వేల్పుల వీరస్వామి జ్ఞాపకార్థం శ్రీ దుర్గా గ్రానైట్ సంస్థ నిర్వాహకులు వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, దాస్యం వినయ్‌భాస్కర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందుకు వచ్చి చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. మాజీ కార్పొరేటర్ వేల్పుల మోహన్‌రావు, నాయకులు సదానందం జానకిరాములు, వేల్పుల సందీప్, నిఖిల్ ఉన్నారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

- ఎస్సార్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ అర్చనారెడ్డి



హసన్‌పర్తి : సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఎస్సార్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి పిలుపునిచ్చారు. ఎస్సార్ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో వారంరోజుల పాటు నిర్వహిస్తున్న ప్రత్యేక వేసవి శిబిరం మంగళవారం మండలంలోని ఎల్లాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైంది. అర్చనారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎస్సార్ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. కళాశాల డీన్ డాక్టర్ భూపాల్‌రాజ్, వి.వి.వి.సుధాకర్, ప్రోగ్రాం సమన్వయ కర్త కె.రవీందర్, భార్గవి, హెచ్‌ఎం సంపత్, స్థానికులు పాల్గొన్నారు.

బూడిదిగడ్డ.. సమస్యల అడ్డా

- బాపూజీనగర్‌లో అధ్వానంగా రోడ్లు
- అస్తవ్యస్తంగా డ్రెయినేజీలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



బూడిదిగడ్డ సర్కిల్‌లో గుంతలుగా సీసీ రోడ్డు



కంకరతేలిన రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డు

కాజీపేట రూరల్ : కాజీపేట 47వ డివిజన్ బాపూజీనగర్ (బూడిదిగడ్డ)లో స్థానికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. బాపూజీనగర్ మెయిన్‌రోడ్ నుంచి కాలనీలోకి వెళ్లే ప్రధాన సీసీ రోడ్డు ధ్వంసమై గుంతలుగా ఏర్పడి ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. చాలా చోట్ల రోడ్లు దెబ్బతినడంతో వాహనాలు తరుచూ రిపేర్‌కు వస్తున్నాయని వాహనదారులు వాపోతున్నారు. బూడిదిగడ్డ నుంచి రైల్వే కాలనీ మీదుగా రైల్వేస్టేషన్ రోడ్డుకు వెళ్లే రహదారి కంకర తేలి అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డుపై వెళ్లాలంటే స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుచోట్ల డ్రెయినేజీలు దెబ్బతిని మురుగు నిల్వడంతో దుర్వాసన వెదజల్లుతోందని, దీంతో దోమలు సైతం విజృంభిస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు. రాత్రిళ్లు కుక్కల స్వైర విహారంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, పాలకులు పట్టించుకొని బూడిదిగడ్డలో నెలకొన్న సమస్యలు పట్టించుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సీసీ రోడ్లను బాగుచేయండి

బాపూజీనగర్ (బూడిదిగడ్డ)లో పలు చోట్ల దెబ్బతిన్న సీసీ రోడ్లను గ్రేటర్ అధికారులు, పాలకులు మరమ్మతులు చేయాలి.కొన్ని చోట్ల సైడ్ డ్రెయినేజీలు దెబ్బతిన్నాయి. డ్రెయినేజీలలో మురుగు నీరు బయటికి వెళ్లకుండా నిలిచిపోయి దుర్వాసన వస్తుంది. కుక్కల స్వైరవిహారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.



– షేక్ గఫార్, స్థానికుడు

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి చేయాలి

- జై బాపు, జై భీమ్, జై సంవిధాన్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు



ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, నాయకులు

హసన్‌పర్తి : అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు పిలుపునిచ్చారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పేర్కొన్నారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి నాగరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మతం బేధం లేకుండా పార్టీని ముందుకు నడిపించడమే సన్నాహక సమావేశ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి రాహుల్ గాంధీ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదానికి పిలుపునిచ్చారని చెప్పారు. ఈ సందర్భంగా రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. టీజీ క్యాబ్ రాష్ట్ర చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు తీసుకు రావడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుందన్నారు. కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ..బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం సామాజిక విప్లవమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య, వైస్ చైర్మన్ తిరుపతి, పీఏసీఎస్ చైర్మన్లు ఉదయ్‌కుమార్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, అనిల్‌రావు, దేవస్థాన కమిటీ చైర్మన్ వెంకటస్వామి, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు వీసం సురేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు, డివిజన్, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- పీఆర్‌టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి దేవేందర్



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్

విద్యారణ్యపురి : జీఓ 317ను రద్దు చేసేలా నూతన ఎమ్మెల్సీలు కృషి చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండలో పీఆర్‌టీయూ ఉమ్మడి జిల్లాస్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మన్నె చంద్రయ్య మాట్లాడుతూ..కొత్త ఉద్యోగులకు ఒక న్యాయం, పాత ఉద్యోగులకు మరో న్యాయమా అని ప్రశ్నించారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రాచర్ల శ్రీనివాస్, బాధ్యులు వెంకటేష్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి దావు రమేష్, బాధ్యులు శంకర్, మహేందర్, సంతోష్, బండారి కుమారస్వామి, శరత్, నరేష్, బోడ రాంజీ, ప్రశాంత్, మందగిరిబాబు పాల్గొన్నారు.

జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలి

- ఏబీవీపీ క్షేత్ర సంఘటన కార్యదర్శి శివకుమార్



మాట్లాడుతున్న శివకుమార్ చిత్రంలో విద్యార్థులు

హన్మకొండ అర్బన్ : విద్యార్థులు జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలని ఏబీవీపీ క్షేత్ర సంఘటన కార్యదర్శి శివకుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం బాలసముద్రంలోని సామా జగన్‌మోహన్ స్మారక భవన్‌లో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్, సామా జగన్‌మోహన్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ఎంసెట్ శిక్షణ తరగతులను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ విద్యారంగంలోని ప్రతి సమస్యల పోరాడుతూ విద్యార్థుల శ్రేయస్సు కోసం ముందుండే ఏకైక ఆర్గనైజేషన్ ఏబీవీపీ అని తెలిపారు. కార్యక్రమంలో పూర్వ రాష్ట్ర కార్యదర్శి అంబాల కిరణ్, వరంగల్ విభాగ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుంట హర్షవర్ధన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెరుగు శ్యామ్, ప్రాంత కార్య సమితి సభ్యులు ఆరెపల్లి సుజిత్, కొత్తపల్లి సుధాకర్, నగర కార్యదర్శి తాళ్లపల్లి అరుణ్, శ్రవణ్ కుమార్, హరిచరణ్, శ్రీకాంత్, రోహిత్, రాహుల్, రేవంత్, ప్రవిజ్ఞాన్, విద్యార్థులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు సన్న బియ్యం పంపిణీ



కాజీపేట రూరల్: బాపూజీనగర్ రేషన్ షాపు వద్ద బారులుదీరిన లబ్ధిదారులు



మడికొండ : సన్న బియ్యం పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హసన్‌పర్తి : పేదలకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మండల కేంద్రంలో తహసీల్దార్ చల్లా ప్రసాద్ మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. అలాగే ఆయా గ్రామాల్లో సంబంధిత అధికారులు కూడా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, అరుణకుమారి, జక్కుల రజిత, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, పొన్నాల రఘు, దేవస్థాన కమిటీ చైర్మన్ అరెల్లి వెంకటస్వామి, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు వీసం సురేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, దేవస్థాన మాజీ చైర్మన్ జె.రవీందర్, నాయకులు పెద్దమ్మ నర్సింహారాములు, సురేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణం వద్ద బారులు

కాజీపేట రూరల్ : కాజీపేట బాపూజీనగర్ మెయిన్ రోడ్‌లోని రేషన్ షాపులో సన్నబియ్యం కోసం లబ్ధిదారులు మంగళవారం బారులుదీరారు. సన్న బియ్యం కోసం లబ్ధిదారులు బారులుదీరడంతో వరంగల్–హైదరాబాద్ హైవే మెయిన్‌రోడ్డు గుండా వాహనాలపై వెళ్లే వారు ఆసక్తిగా తిలకించారు.

46వ డివిజన్‌లో..

మడికొండ : మడికొండలోని రేషన్ షాపులో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ పేదకు సన్న బియ్యం అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్టుగుట్ట చైర్మన్ రఘుచందర్, మాజీ సర్పంచ్ వస్కుల వెంకటస్వామి, గుర్రం జ్యోతి అమర్‌నాథ్, బిల్ల రవీందర్, బైరి లింగమూర్తి, నీలం రజిని వేణుయాదవ్, దువ్వ విజయ్, వస్కుల శ్రీనివాస్, కుర్ల మోహన్, నాగరాజు, మూల మురళి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ప్రధానమంత్రి ఫొటో ఏదీ?

- బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ ధర్మారావు



మాట్లాడుతున్న మార్తినేని ధర్మారావు

హసన్‌పర్తి : జాతీయ ఆహార పంపిణీ పథకం ద్వారా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫొటో ఏదని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు ప్రశ్నించారు. మంగళవారం సన్న బియ్యం పంపిణీ చేస్తున్న రేషన్‌షాపును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై ప్రధానమంత్రి ఫొటో లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ ఆహార పంపిణీ పథకం కింద మరో ఐదేళ్ల పాటు ఉచితంగా బియ్యం అందజేయనున్నట్లు తెలిపారు. స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మారపల్లి రాంచంద్రారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్‌రావు, బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతి ,రైల్వే బోర్డు సభ్యులు దాసరి రాజు, మేకల హరిశంకర్, తాళ్ల శ్యాం తదితులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



హసన్‌పర్తి : మండలంలోని నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2004–05 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు గూడూరు శ్రీకాంత్, మేకల శంకర్, గౌరు విజయలక్ష్మి, నిరోష, రాజశేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాములోరికి గోటి తలంబ్రాలు



ఖిలా వరంగల్ : వరంగల్ శంభునిపేటలోని కార్యసిద్ధి హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో ఆలయ పరపతి సంఘం కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 6న సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. మంగళవారం మహిళలు భక్తిశ్రద్ధలతో ఆలయానికి వచ్చి ధాన్యం గింజలను గోటితో ఒలిచి తలంబ్రాలు సిద్ధం చేస్తున్నారు. గోటితో ఒలిచిన తలంబ్రాలకు ముత్యాలు జోడించి స్వామివారి కల్యాణంలో ఉపయోగించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు చెప్పారు. శంభునిపేటకు చెందిన దేవులపల్లి శ్రీలత, అడెపు దేవిక, బలభద్ర ఉమాదేవి, మిట్టపల్లి శ్రీదేవి, పరకాల మంజుల, విలాసరపు అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఐదురోజుల పాటు శ్రీరామనవమి వేడుకలు



రామన్నపేట : ఎల్లమ్మ బజార్‌లోని సాయి సేవాదళ్ భజన మందిరంలో సాయి సేవాదళ్, సాయిబంధు మహిళా పరపతి సంఘం ఆధ్వర్యంలో ఈ ఏడాది శ్రీరామనవమి వేడుకలు ఐదు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు సాయిబంధు మహిళా పరపతి సంఘం అధ్యక్షురాలు ఆరుట్ల ప్రసూన తెలిపారు. శ్రీరామ నవమి వేడుకల నిర్వహణపై మంగళవారం సంఘం సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఐదు రోజుల వేడుకల్లో భాగంగా బుధవారం పసుపు దంచడం, గురువారం సంగీత్, శుక్రవారం మెహందీ, శనివారం మంగళస్నానాలు, ఎదుర్కోలు, ఆదివారం సీతారాముల కల్యాణ మహోత్సవం ఉంటుందని తెలిపారు. అలాగే ఈ ఏడాది పోలా లక్ష్మీ–ఉమామహేశ్వర్ దంపతులు బహూకరించిన సీతారాముల పంచలోహ విగ్రహాలకు కళ్యాణ వేడుక నిర్వహించనున్నట్లు తెలిపారు. వైభవంగా నిర్వహించే ఈ వేడుకలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వరూపారాణి, వేముల కమల, చిన్నాల హారిక, సభ్యులు మోటుపల్లి వాణి, పద్మావతి, అరుణ, విజయలక్ష్మి, శారద, తదితరులు పాల్గొన్నారు.

బీసీ పోరుగర్జనను జయప్రదం చేయాలి

ఖిలా వరంగల్ : ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నేడు (బుధవారం) తలపెట్టిన బీసీ పోరు గర్జనను జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గోగికార్ రవీందర్ పి లుపునిచ్చారు. మంగళవారం వరంగల్ లక్ష్మి నగర్‌లో పిట్ట రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన జ రిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్యనారాయణ, యాకయ్య,సాంబశివుడు, కృష్ణమూర్తిభరత్, మహేష్ పాల్గొన్నారు.

‘హరిత కాకతీయ’లో రుద్రాక్షల ప్రదర్శన



హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన రుద్రాక్షల ప్రదర్శన

హన్మకొండ : హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో నేపాలి రుద్రాక్ష, కరంగళి మాలల ఎగ్జిబిషన్ కమ్ సేల్ ప్రారంభించినట్లు నేపాల్ రుద్రాక్ష ఆర్గనైజేషన్ మేనేజింగ్ డైరెక్టర్ దుర్గా ప్రసాద్ పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో ఏకముఖి నుంచి 21 ముఖాల రుద్రాక్షలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. పుట్టిన తేదీ, జన్మ రాశి, జన్మ నక్షత్రమును అనుసరించి రుద్రాక్షలు, కరంగళి మాలలు, స్పటిక సాలగ్రాలు, దక్షణావృత శంకులు, పంచముఖి వెండితో అల్లిన మాలలు, చిన్న రుద్రాక్షలు ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నెల 4వ తేదీ వరకు ప్రదర్శన కమ్ సేల్స్ కొనసాగుతుందని వెల్లడాంచారు.

సన్మానం



భవ్యను అభినందిస్తున్న పద్మశాలీలు


ఖిలా వరంగల్ : నగరంలోని 39వ డివిజన్ ఏకశిల నగర్‌కు చెందిన కుడికాల భవ్య గ్రూప్–1 ఫలితాల్లో 9వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం వరంగల్ శివనగర్‌లో పద్మశాలి భవనంలో పద్మశాలీ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భవ్యను శాలువాతో సత్కరించారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ బాసాని శ్రీనివాస్, ధర్మపురి రాజగోవింద్, మాటేటి అశోక్, కామేశ్వర్, పాము శ్రీనివాస్, వద్నాల నరేందర్, సుభాష్, సంతోష్, బైరి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు

గ్రూప్–1 విజేతకు శుభాకాంక్షలు



నయీంనగర్ : గ్రూప్–1 విజేత తోట సోనికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మంగళ వారం హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోనీని నాయిని రాజేందర్‌రెడ్డి శాలువాతో సత్కరించి పూలమొక్క అందజేశారు.

తేజస్విని రెడ్డికి..



హన్మకొండ : గ్రూప్–1 ర్యాంకర్ జిన్న తేజస్విని రెడ్డిని 57వ డివిజన్ కార్పొరేటర్ నల్ల స్వరూప రాణి, సుధాకర్ రెడ్డి దంపతులు మంగళవారం సన్మానించారు. గ్రూప్–1లో అత్యుత్తమ ర్యాంక్ సాధించడం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు.

గ్రూప్–1లో మేఘనకు 22వ ర్యాంక్, నిశాంత్‌కు 335వ ర్యాంకు



మేఘన



నిశాంత్

హసన్‌పర్తి : గ్రూప్–1 ఫలితాల్లో భీమారానికి చెందిన శీలం మేఘన రాష్ట్ర స్థాయిలో 22వ ర్యాంక్, జోన్ స్థాయిలో 12 ర్యాంక్ సాధించింది. ఐఏఎస్ లక్ష్యంతో ఆమె పరీక్షలకు సిద్ధంకాగా తొలిసారి గ్రూప్–1 మెయిన్స్‌కు అర్హత సాధించినట్లు ఆమె తండ్రి రఘువీర్ తెలిపారు. అలాగే 56వ డివిజన్ ఎస్‌వీఎస్ హోమ్స్‌కు చెందిన బూరగడ్డ నిశాంత్ 335వ ర్యాంకు సాధించాడు.

నియామకం



మేరుగు రమేశ్

హన్మకొండ : ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మేరుగు రమేశ్‌ను నియమించినట్లు ఆ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు కె.అనిల్ కుమార్ తెలిపారు. హనుమకొండ అడ్వకేట్స్ కాలనీకి చెందిన రమేశ్‌ను నియమించినట్లు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా రంజిత్ కుమార్



వరంగల్ : కన్జ్యూమర్ కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా వరంగల్‌కు చెందిన రావుల రంజిత్‌కుమార్‌ను నియమిస్తూ జాతీయ కమిటీ అధ్యక్షురాలు ప్రీతి పాండ్య ఉత్తర్వులు జారీ చేశారు.

చెక్కుల అందజేత

వరంగల్ : వరంగల్ తూర్పు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 13వ డివిజన్‌కి చెందిన లబ్ధిదారులకు కార్పొరేటర్ సురేష్‌కుమార్ జోషి మంగళవారం షాదీముబారక్ చెక్కులను అందజేశారు.

విద్యార్థులపై దాడి అమానుషం

విద్యారణ్యపురి : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులపై పోలీసుల దాడి అమానుషమని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ సభ్యుడు రాచర్ల బాలరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

హెచ్‌సీయూ భూముల విక్రయాలు నిలిపివేయాలి

హసన్‌పర్తి : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల విక్రయాలను వెంటనే నిలిపివేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ(ఎం) మండల కమిటీ సమావేశం నిర్వహించారు. మంద సుచేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాగుల రమేష్, గుమ్మడి రాములు, పుల్లా అశోక్, సుమన్,రజిత, రమేష్, పద్మ, మౌనిక, సమ్మక్క, వాణిపాల్గొన్నారు.

సీపీఎం నాయకుల అరెస్టు

న్యూశాయంపేట : చలో హెచ్‌సీయూలో భాగంగా హనుమకొండ సుబేదారి పోలీసులు మంగళవారం సీపీఎం నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్‌రెడ్డిచక్రపాణి, సంపత్, శ్రీకాంత్, కళ్యాణ్, ప్రశాంత్ ఈశ్వర్ అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

కేయూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు..

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీకి చెందిన ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం నాయకులను మంగళవారం అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో ఎస్‌ఎఫ్‌ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, కేయూ కార్యదర్శి బీరెడ్డి జస్వంత్, యూనివర్సిటీ కమిటీ సభ్యులు రాహుల్ ఉన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

వరంగల్ : వరంగల్ 3వ డివిజన్ కొత్తపేటలో డాక్టర్ పగడాల ప్రవీణ్ హత్యను నిరసిస్తూ స్థానిక ఆర్‌సీఎం, టీబీసీ చర్చిల ఆధ్వర్యంలో మంగళవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాదిగ కుల సంఘ అధ్యక్షుడు ఈసంపెల్లి సుదర్శన్ మాట్లాడుతూ ప్రవీణ్‌ను హత్య చేసిన దుండగులను వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇసంపెల్లి రాజు, వేణు, సంజీవ, శ్రీనివాసులు, బొచ్చు రాజు, కుమారస్వామి, మైఖేల్, అనిల్, విక్రం, పాల్సన్‌రాజ్, తరుణ్ పాల్గొన్నారు.

నేడు సర్వాయి పాపన్న వర్ధంతి

కాజీపేట అర్బన్ : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని నేడు (బుధవారం) హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారికంగా నిర్వహించనున్నట్లు బీసీ వెల్ఫేర్ డీడీ రాంరెడ్డి తెలిపారు. కలెక్టర్ పాల్గొనే ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కుల సంఘాల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై సర్వాయి పాపన్నకు నివాళులర్పించాలని కోరారు.

రేపు శ్రీదత్త విజయానంద తీర్థస్వామిజీ రాక

హన్మకొండ కల్చరల్ : అవదూత దత్తపీఠం ఉత్తరాది పరమహంస పరివ్రాజకాచార్యులు శ్రీశ్రీ దత్త విజయానందతీర్థ స్వామి గురువారం సాయంత్రం ములుగురోడ్‌లోని దత్త క్షేత్రానికి రానున్నారు. వరంగల్ శివనగర్‌లోని రామాలయంలో శుక్రవారం ఉదయం కుంభాభిషేకం, సాయంత్రం దత్త క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ నగదును అభివృద్ధికి కేటాయించాలి

హసన్‌పర్తి : ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా వచ్చిన నగదును కార్పొరేషన్ అభివృద్ధికి కేటాయించాలని కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ కోరారు. మంగళవారం మేయర్, కమిషనర్‌లకు విజ్ఞప్తి చేశారు. గతంలో భూముల అమ్మకం ద్వారా రూ.774కోట్లు సమకూరగా ,వాటిని అభివృద్ధికి ఖర్చు చేయకుండా ప్రభుత్వ ఖజానాలో జమ చేసుకున్నారని చెప్పారు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఏర్పడుతోందని అనుమానం వ్యక్తం చేశారు.

కేసు నమోదు

ఖిలా వరంగల్ : రోడ్డు క్రాస్ చేస్తున్న మహిళను బైక్‌తో ఢీకొట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. ఫోర్ట్ రోడ్డు అంబేడ్కర్ నగర్‌కు చెందిన శోభారాణి (50) కిరాణం సరుకుల కోసం కాలినడకన హనుమాన్ జంక్షన్‌కు వచ్చింది. తిరిగి రోడ్డు క్రాస్ చేస్తున్న ఆమెను నగరానికి చెందిన సలీమ్ బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మంగళవారం బాధితురాలి కుమార్తె మునుబోతుల ఝాన్సీరాణి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు

‘ఉత్తమ ఉద్యోగిని మరిచిపోరు’

హన్మకొండ : ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించిన ఉద్యోగిని మరిచిపోరని, విద్యుత్ వినియోగదారులకు సేవలు అందించడంలో లైన్ ఇన్‌స్పెక్టర్ దర్శనాల మొగిలయ్య ముందున్నారని టీజీ ఎన్పీడీసీఎల్ హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ అశోక్ కుమార్ పేర్కొన్నారు. గోపాల్‌పూర్ సెక్షన్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన మొగిలయ్య సన్మాన అభినందన సమావేశం హనుమకొండ సుబేదారిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా మొగిలయ్యను అధికారులు, ఉద్యోగులు, అసోసియేషన్ నాయకులు సన్మానించారు.

వీల్ చైర్ అందజేత



విద్యారణ్యపురి : విద్యాఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఉపాధ్యాయుడు బిల్లా మహేందర్–సరితల పెళ్లి రోజు సందర్భంగా మంగళవారం కరీమాబాద్‌కు చెందిన దివ్యాంగ విద్యార్థి రామగిరి అభినవ్‌కు రూ.6వేల విలువైన వీల్‌చైర్‌ను అందజేశారు. వడ్డెపల్లిలోని విద్యాఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బాధ్యులు అంజనీదేవి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కాజీపేట : కాజీపేట పట్టణ శివారులో అతివేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి ఆటోను ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మంగళవారం సోమిడి నుంచి తాళ్ల పద్మావతి కళాశాల వైపు వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. అనంతరం అదే వేగంతో వెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో ధ్వంసమైంది. ఈ ఘటనలో సోమిడికి చెందిన ముడికె కార్తీక్ (20), మహేష్ (21)లు గాయపడ్డారు. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా ఈఎంటీ శివకుమార్, పైలట్ కుమారస్వామి బాధితులను ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ఆటోలో ప్రయాణిస్తున్న కార్తీక్, మహేష్‌ల రెండు కాళ్లు విరిగినట్లు వైద్యులు తెలిపారు. స్థానిక పోలీసులు ప్రమాద స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు.